క్లుప్తంగా

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుతాం


మాట్లాడుతున్న మెస్రం జంగుబాపు

ఇచ్చోడ: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుతామని బీఎస్పీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి మెస్రం జంగుబాపు అన్నారు. శనివారం ఇచ్చోడ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో పాలిస్తున్న కాంగ్రెస్, ప్రతిపక్ష హోదాలో ఉన్న బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు రాష్ట్ర ప్రజలను మోసం చేశాయని ఆరోపించారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఒక్క హామీని కూడా కాంగ్రెస్ అమలు చేయలేదన్నారు. ప్రజల పక్షాన ఉంటు బీఎస్పీ ప్రజ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తుందన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రత్నపురం రమేశ్, కాప్మె పోశెట్టి, కొడప జంగు, సజన్, ప్రదీప్ పాల్గొన్నారు.

హనుమాన్ చాలీసా పారాయణం

ఇచ్చోడ: మండల కేంద్రంలోని సుభాష్‌నగర్ కాలనీలో శనివారం సాయంత్రం నిర్వహించిన సాముహిక హనుమాన్ చాలీసా పారాయణం ఘనంగా జరిగింది. హనుమాన్ చాలీసా భజన బృందం ఆదిలాబాద్, సనాతన ధర్మసేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. అనంతరం మహా ప్రసాదం వితరణ చేశారు.

ఐటీఐ కోర్సులను సద్వినియోగం చేసుకోవాలి


అవగాహన కల్పిస్తున్న ఐటీఐ ప్రిన్సిపాల్

ఆదిలాబాద్: ఐటీఐ కళాశాలల్లో అందిస్తున్న సాంకేతిక శిక్షణ కోర్సులను సద్వినియోగం చేసుకోవాలని ఉట్నూర్ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ రొడ్డ శ్రీనివాస్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియం, గాంధీ పార్కులలో శనివారం ఐటీఐలో అందించే శిక్షణ కోర్సుల గురించి అవగాహన కల్పించారు. ఎనిమిదో తరగతి లేదా పదో తరగతి చదివి ఉత్తీర్ణులైన వారు ఐటీఐలో చేరేందుకు అర్హులన్నారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 21 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. కళాశాల సిబ్బంది మధుసూదన్, సమీర్, నాగరాజు, సివిల్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

'దాడులు సరికాదు'

ఆదిలాబాద్‌అర్బన్: కేంద్ర ప్రభుత్వం దేశంలో ఉన్న మైనార్టీల హక్కులు కాలరాస్తూ ముస్లింలపై, ప్రార్థన మందిరాలపై సామూహిక దాడులు చేయించడం సరికాదని వివిధ సంఘాల నాయకులు పేర్కొన్నారు. శనివారం భంసేఫ్, సావిధన్ బచావో, దేశ్ బచావో, క్రాంతికారి హమాలీ యూనియన్, సమతా ఫౌండేషన్ సంఘాల ఆధ్వర్యంలో శాంతియుత నిరసన చేపట్టారు. జాతీయ ముస్లిం మోర్చా, భారతీయ ముక్తి మోర్చా పిలుపుమేరకు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో భంసేఫ్ జిల్లా అధ్యక్షుడు గణేష్ మెకానే, సావిధన్ బచావో, ఎల్లుల సంతోష్ కుమార్, హుస్సైన్, అనిల్ సవలే, అజీజ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన గ్రామస్తులు

బోథ్: మండలంలోని నేరేడుపల్లి గ్రామస్తులు శనివారం ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను నేరడిగొండ మండల కేంద్రంలోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ గ్రామ సమస్యలను ఎమ్మెల్యే దష్టికి తీసుకెళ్లారు. సమస్యల హామీకి ఎమ్మెల్యే హామీ ఇచ్చారని తెలిపారు. ఎమ్మెల్యేను గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో శ్రీధర్ రెడ్డి, శంకర్, నరేందర్ పాల్గొన్నారు.

'పేదలకు అందని మందులు'


మాట్లాడుతున్న మహేందర్ జాదవ్

నేరడిగొండ: ప్రభుత్వ దవాఖానాల్లో వైద్యులు పేద ప్రజలను పరీక్షించిన అనంతరం వారికి మందులు అందడం లేదని లైవ్ జిల్లా అధ్యక్షుడు మహేందర్ జాదవ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ దవాఖానల్లో పేద ప్రజలకు సరైన మందులు అందడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు అవసరమైన మెడిసిన్ ప్రభుత్వ దవాఖానాల్లో అందించకుండా, ప్రైవేట్ ఫార్మాసిల నుంచి కొనుగోలు చేయాలని వైద్యులు సూచించడంపై మండిపడ్డారు. ప్రభుత్వ వైద్యులకు జీతాలు సరిపోవడం లేదనే విధంగా ప్రైవేట్ ఆస్పత్రులు పెట్టి ప్రభుత్వ దవాఖానాలను నిర్లక్ష్యం చేస్తున్నారని పేర్కొన్నారు. జిల్లా అధికారులు వెంటనే స్పందించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

అడ్మిషన్ల భర్తీకి కసరత్తు

- ఎస్సీ వసతి గృహాల్లో 100 సీట్లు
- తాంసి, కప్పర్లలోని ఎస్సీ హాస్టళ్లో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం
- నాణ్యమైన భోజనంతో పాటు వసతులు


తాంసిలోని షెడ్యూల్ కులాల సంక్షేమ వసతి గృహం

తాంసి: షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాలను ఏర్పాటు చేసింది. వీటిలో భాగంగా తాంసి మండల కేంద్రంతో పాటు కప్పర్ల గ్రామంలో ఎస్సీ సంక్షేమ వసతి గృహాలు ఉన్నాయి. వీటిలో విద్యార్థుల సంఖ్య పూర్తి స్థాయిలో భర్తీ చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. వివిధ వసతులతో పాటు వేడినీరు అందించే గీజర్లు ఏర్పాటు చేశారు. ఇన్ని వసతులు ఉన్నా.. వసతి గృహంలో విద్యార్థుల సంఖ్య ప్రతీ ఏటా తగ్గుతూ వస్తోంది. విద్యార్థుల సంఖ్య మరింత పెంచాలనే ఉద్దేశంతో అధికారులు వసతి గృహంలో చేరాలని ప్రచారం చేస్తున్నారు.

వంద మంది విద్యార్థులకు అడ్మిషన్లు..

తాంసి, కప్పర్ల గ్రామాల్లోని ఎస్సీ సంక్షేమ వసతి గృహాల్లో వంద మంది విద్యార్థులకు అవకాశం కల్పించే అవకాశం ఉంది. వరుసగా రెండేళ్లుగా సంక్షేమ వసతి గృహాల్లో పూర్తిస్థాయిలో అడ్మిషన్లు లేక హాస్టల్‌లో సీట్లు ఏడాది పొడవునా.. ఖాళీగా ఉంటున్నాయి. ప్రస్తుతం తాంసిలో 35 మంది, కప్పర్లలో 45 మంది విద్యార్థులు మాత్రమే ఉంటున్నారు. హాస్టల్‌లో వంద శాతం విద్యార్థులను చేర్చడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నారు. ఇతర మండలాలకు చెందిన విద్యార్థులకు సైతం ప్రవేశాలు కల్పిస్తామని అధికారులు పేర్కొంటున్నారు. 6 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు అవకాశం కల్పిస్తున్నారు. మొత్తం 100 మంది విద్యార్థులను చేర్చుకోవడానికి సీట్లు కేటాయించగా ఇందులో ఎస్సీలకు 75 శాతం, బీసీలకు 12, ఎస్టీలకు 6 సీట్లను సైతం కేటాయిస్తున్నారు. తాంసి వసతి గృహంలో 65, కప్పర్ల వసతిగృహంలో 55 సీట్లు ఖాళీగా ఉన్నాయి.

నాణ్యమైన భోజనం..

విద్యార్థులకు వసతులతో పాటు నాణ్యమైన భోజనాన్ని నిత్యం అందించనున్నారు. ఉదయం 7 గంటలకు రాగిజావ, పాలు ఇస్తారు. అనంతరం గంట తర్వాత బ్రేక్‌ఫాస్ట్‌లో భాగంగా ఉప్మా, పులిహోర, కిచిడి రసం, చపాతి, పూరీ, ఇడ్లి చట్నీ, జీర రైస్, టమాట అన్నం రోజుకో రకంగా ఇస్తారు. మధ్యాహ్నం పాఠశాలలో భోజనం ఉంటుంది. సాయంత్రం ఐదు గంటలకు స్నాక్స్ కింద పల్లిపట్టి, అటుకులు, బిస్కెట్స్, శనగలు, బొబ్బర్లు, స్వీట్స్‌తో పాటు ప్రతీ ఆదివారం మధ్యాహ్నం చికెన్ రైస్, గుడ్డు ప్రత్యేకంగా అందిస్తారు. వారంలో రెండు రోజులు గుడ్డుతో పాటు అరటిపండ్లు, ఇతర పండ్లు అందించడం జరుగుతుంది.

అన్నిసీట్లు భర్తీ చేస్తాం



తాంసి వసతి గృహంలో వంద సీట్లు భర్తీ చేసేందుకు చర్యలు చేపడుతున్నాం. ప్రస్తుతం పాఠశాలలు ప్రారంభమయ్యాయి. అవకాశం ఉన్న విద్యార్థులు వసతి గృహంలో చేరి చదువుకునేలా అవగాహన కల్పిస్తున్నాం. ఇప్పటికే ఆయా మండలాల్లో విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాం.

– బి.సురేందర్, హాస్టల్ వార్డెన్, తాంసి

ఖరీఫ్ ప్రారంభంలోనే ఎరువుల కొరత

- వారం రోజుల నుంచి డీఏపీలు నో స్టాక్
- ఆందోళనలో అన్నదాతలు


బజార్‌హత్నూర్ సహకార సంఘం

ఇచ్చోడ: ఖరీఫ్ ప్రారంభంలో ఎరువుల కొరతతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు., మృగశిర కార్తె ప్రారంభంలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవడంతో జిల్లాలో సాగు పనులు ముమ్మరం చేస్తున్నారు. గత నాలుగు రోజుల నుంచి రైతులు తమ పంటపొలాల్లో పత్తి విత్తనాలు విత్తుకుంటున్నారు. పత్తి విత్తుకునే ముందు జిల్లా రైతులు ఫౌండెషన్ సీడ్‌గా ముందుగా డీఏపీ వేసిన తర్వాతే పత్తి విత్తనాలు విత్తుకుంటారు. కానీ వారం రోజు నుంచి డీఏపీ కొరత ఉండటంతో రైతులు ఆందోళ చెందుతున్నారు.

4 లక్షల 40 వేల డీఏపీ బస్తాలు..

జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది 4 లక్షల 40 వేల ఎకరాల్లో పత్తి సాగు అవుతున్నట్లు వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. ఈ లెక్కన ఎకరానికి ఒక్క డీఏపీ బ్యాగ్ చొప్పున అంటే దాదాపుగా 4 లక్షల 40 వేల డీఏపీ బ్యాగులు అవసరం అవుతుంది. డీఏపీ అందుబాటులో లేకపోవడంతో రైతులు నానా అవస్థలు పడుతున్నారు.

సహకార సంఘాల్లో నో స్టాక్..

ఇచ్చోడ మండల కేంద్రంలోని సహకార సంఘంలో నాలుగు రోజుల నుంచి డీఏపీ స్టాక్ లేదు. 20 టన్నుల డీఏపీ కోసం ఇండెంట్ పంపిన శనివారం వరకు స్టాక్ రాలేదు. అలాగే బజార్‌హత్నూర్, నేరడిగొండ, ఇంద్రవెల్లి, గుడిహత్నూర్, తలమడుగు సహకార సంఘంలో గత కొన్ని రోజుల నుంచి డీఏపీ స్టాక్ లేదు.

డీఏపీ కొరత లేదు

జిల్లా వ్యాప్తంగా డీఏపీ కొరత లేదు. జిల్లాలో రైతులకు కావాల్సిన డీఏపీని వ్యవసాయ సహకార సంఘలలో ప్రైవేట్ డీలర్ల వద్ద అందుబాటులో ఉంది. అప్పుడప్పుడు కొంత అలస్యం అయిన కొరత మాత్రం లేదు.

– శ్రీధర్ స్వామి, జిల్లా వ్యవసాయాధికారి, ఆదిలాబాద్

సమస్యల సంత



నేరడిగొండ మండల కేంద్రంలో ప్రతీ శనివారం నిర్వహించే వారసంతతో ప్రజలు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. అండర్ బ్రిడ్జితో పాటు సర్వీసు రోడ్డులకు ఇరువైపులా చిరు వ్యాపారులు దుకాణాలను ఏర్పాటు చేయడం, రద్దీగా మారుతోంది. వాహనాలు, ఆర్టీసీ బస్సులు వెళ్లాలేని పరిస్థితి. మరోవైపు బైకులు ఎక్కడబడితే అక్కడే పార్కింగ్ చేస్తుండడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది.

– నేరడిగొండ

ఎమ్మెల్యేకు సన్మానం


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

ఉట్నూర్‌రూరల్: ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు రెండోసారి టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన సందర్భంగా నాయకులు హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ప్రజల కోసం విరామం లేకుండా పనిచేసే ఎమ్మెల్యే రాబోయే రోజుల్లో మరిన్ని పెద్ద పెద్ద పదవులు అధిరోహించాలని శుభాకాంక్షలు తెలిపారు. ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు చంద్రయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇక్బాల్, తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో చదివితే ఏదైనా సాధ్యమే


విజయ్‌ని సన్మానిస్తున్న గ్రామస్తులు

నార్నూర్: యువత పట్టుదలతో చదివితే ఏ ఉద్యోగమైన సాధించవచ్చని మాజీ సర్పంచ్ బానోత్ గజానంద్ నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని దుర్గానగర్‌కు చెందిన రాథోడ్ అశోక్ కుమారుడు రాథోడ్ విజయ్ పోలీస్ ఉద్యోగానికి ఎంపికై శనివారం శిక్షణకు వెళ్తున్న సందర్భంగా గ్రామస్తులతో కలిసి ఆయనను సన్మానించారు. నిరుపేద కుటుంబం నుంచి పట్టుదలతో అనుకున్న లక్ష్యసాధన కోసం నిరంతరం కృషి చేసి పోలీస్ ఉద్యోగానికి ఎంపికైన రాథోడ్ విజయ్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షుడు ఫెరోజ్ ఖాన్, వీటీడీఏ ఉపాధ్యక్షుడు ఆడే దిగంబర్, దళిత రత్న అవార్డు గ్రహీత కొర్రెల మహేందర్, పెసా చట్టం కోఆర్డినేటర్ రాథోడ్ సికిందర్, చాలుకర్ విజయ్, రాథోడ్ సుభాష్ పాల్గొన్నారు.

'ఆపరేషన్ కగార్' నిలిపివేయాలి


కుటుంబీకులను పరామర్శిస్తున్న ఆడే గజేందర్

బోథ్: కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ నిలిపివేయాలని బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ డిమాండ్ చేశారు. శనివారం ఆపరేషన్ కగార్‌లో భాగంగా బీజాపూర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన బోథ్ మండలం పోచ్చేర గ్రామానికి చెందిన మైలారపు ఆడేల్లు అలియస్ భాస్కర్ కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ.. నమ్మిన సిద్ధాంతం కోసం 33 సంవత్సరాలు అజ్ఞాతలో ఉండి దండకారణ్యంలో పేదలకు పోడు భూముల పంపిణీ, విద్యపై అవగాహన పెంచిన వ్యక్తి ఆడెల్లు అని గుర్తు చేశారు. వారి సోదరులకు ప్రభుత్వం నుంచి ఇందిరమ్మ ఇళ్లు వచ్చే విధంగా కృషి చేస్తానని, తన వంతుగా ఆర్థిక సాయం అందిస్తానన్నారు. అనంతరం గ్రామానికి చెందిన లక్ష్మణ్ కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు బోడ్డు గంగారెడ్డి, సత్యవతి కోటేశ్వర్, గొర్ల రాజు యాదవ్, పోతన్న, మహేందర్, బద్దం పోతారెడ్డి, రాజు, ఇట్టెడి రాజురెడ్డి, గాజుల పోతన్న, విజయ్ భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

జొన్న డబ్బులు చెల్లించాలి



మాట్లాడుతున్న నాయకులు

బోథ్: జొన్న డబ్బులను వెంటనే రైతుల ఖాతాల్లో జమచేయాలని సీపీఐ నాయకులు అన్నారు. శనివారం మండల కేంద్రంలో మాట్లాడారు. రైతుల ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకొని జమ చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు గోవర్ధన్. నరేశ్, కార్తీక్, మున్నిప్, సంతోష్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

గో సేవకులతో ఎంపీ ములాఖాత్

ఆదిలాబాద్‌టౌన్: ఇటీవల వాహనాల్లో అక్రమంగా తరలిస్తున్న ఆవులను అడ్డుకుని అరెస్ట్ అయిన గో సేవకులతో ఎంపీ నగేశ్ శనివారం ములాఖాత్ అయ్యారు. జిల్లా జైల్‌లో వారిని కలిసి పరామర్శించారు. కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టడాన్ని ఖండిస్తున్నట్లుగా ఎంపీ తెలిపారు. మూగ జీవాల అక్రమ రవాణాను ప్రోత్సహించవద్దని, అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కుంటాల జలపాతం అభివృద్ధికి ప్రతిపాదనలు

నేరడిగొండ: కుంటాల జలపాతం అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ అన్నారు. శనివారం మండలంలోని కుంటాల జలపాతం పరిసర ప్రాంతాన్ని పరిశీలించారు. జలపాతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడానికి రూ.34 కోట్లతో కేంద్రానికి ప్రతిపాదనలు పంపడం జరిగిందని పేర్కొన్నారు. ఆయన వెంట బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు తాటిపెల్లి రాజు, పెందుర్ తులసీరాం, నారాయణ ఉన్నారు.

బాలుడిని చేరదీసిన ఐసీడీఎస్ అధికారులు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో తప్పిపోయిన బాలుడిని జిల్లా బాలల సంరక్షణ అధికారులు చేరదీశారు. శుక్రవారం ఒంటరిగా ఏడుస్తూ.. కన్పించిన బాలుడిని రైల్వే ఔట్‌పోస్టు పోలీసులు గమనించి చైల్డ్‌లైన్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. దీంతో బాలల సంరక్షణ అధి కారి, సిబ్బంది స్టేషన్ కు చేరుకుని బాలుడిని అక్కున చేర్చుకున్నా రు. శనివారం ఉద యం రైల్వేస్టేషన్‌లోని ప్లాట్ ఫాం, సీసీ పుటేజీలను పరిశీలించారు. డీసీపీవో రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ బా లుడితో మాట్లాడితే ఆ కోల అని, తల్లి కూ ర్పోబెట్టి ఇప్పుడే వస్తానని చెప్పి రాలేదన్నా రు. వారి వెంట పీవోఐసీ ఎన్.స్వామి, ఆర్.వినోద్ కుమార్, షూ్యర్ ఎస్జీవో జిల్లా కోఆర్డినేటర్ వినోద్, చైల్డ్‌లైన్ వర్కర్ రామకృష్ణ, రైల్వే పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

ఫైనాన్స్ వ్యాపారుల అరెస్ట్, రిమాండ్

ఇచ్చోడ: మండల కేంద్రానికి చెందిన ఫైనాన్స్ వ్యాపారులు పాన్‌పట్టి సురేశ్, పాన్‌పట్టి సుభాష్‌లను శనివారం సాయంత్రం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పుష్పలత తెలిపారు. వారు గతంలో మండల కేంద్రానికి చెందిన రవి అనే వ్యక్తికి రూ. 5 లక్షలు ఫైనాన్స్ ఇచ్చారు. దీనికి జమనాతుగా అడేగామ(బి) గ్రామానికి చెందిన జ్ఞానేశ్వర్ అనే వ్యక్తి వద్ద బాండ్ పేపరు రాయించుకున్నారు. ఫైనాన్స్ తీసుకున్న రవి రూ. 5 లక్షలు వాయిదాల ప్రకారం తిరిగి ఇచ్చారు. జమనాతు కింది ఇచ్చిన బాండ్ పేపర్ తిరిగి ఇవ్వమని అడగగా.. ఇండా డబ్బులు ఇవ్వాలని దౌర్జన్యానికి పాల్పడినట్లు తెలిపారు. దీంతో బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

కార్పొరేట్ వైద్యం ఉచితంగా అందించాలి

- ఎమ్మెల్యే పాయల్ శంకర్


లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

ఆదిలాబాద్: నిరుపేదలకు ఉచితంగా ప్రభుత్వాలు కార్పొరేట్ వైద్యం అందించాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలు అరుదైన వైద్యానికి సంబంధించి చికిత్సలకు కార్పొరేట్ ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోందన్నారు. రూ. లక్షల్లో బిల్లులు అవుతుండడంతో వైద్యానికి సైతం వెనుకాడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. అటువంటి పరిస్థితి రాకుండా ప్రభుత్వాలు పూర్తిగా నిరుపేదలకు అండగా ఉండాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కార్పొరేట్ ఆసుపత్రులకు ప్రభుత్వాల నుంచి బిల్లులు రావడం లేదని, తాము చికిత్సలు చేసే పరిస్థితి లేదని ఆసుపత్రి వర్గాలు తెలుపుతున్నాయన్నారు. పేదలు పడుతున్న బాధలను తాను ప్రత్యక్షంగా చూశానన్నారు. ఆయుష్మాన్ భారత్, ఆరోగ్యశ్రీ పథకాలు భాగంగా నిరుపేదలందరికీ 10 లక్షల వరకు ఉచిత వైద్యం అందించేలా ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వేణుగోపాల్, ఆదినాథ్, దయాకర్, జోగు రవి, భీమ్సేన్ రెడ్డి, కేశవ్, కరుణాకర్ రెడ్డి, సత్యానంద్, సన్నీ మహేందర్, పోతురాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం


పరామర్శిస్తున్న ఎంపీ నగేశ్, ఎమ్మెల్యే శంకర్


పరామర్శిస్తున్న కుమ్ర ఈశ్వరీబాయి

సాత్నాల(భోరజ్): పిడుగుపాటుకు గురై మృతి చెందిన కుటుంబాలకు అండగా ఉంటామని ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఇటీవల బేల మండలంలో పిడుగుపాటుకు గురై మృత్యువాత పడిన కోవ సునీత (40) కుటుంబసభ్యులను భోరజ్ మండలంలోని పెండల్‌వాడ గ్రామంలో శనివారం పరామర్శించారు. ప్రభుత్వం తరఫునుంచి వచ్చే ఆర్థిక సాయం గురించి అధికారులతో మాట్లాడడం జరిగిందన్నారు. బీజేపీ నాయకులు ఇంద్రజిత్, కరుణాకర్ రెడ్డి ఉన్నారు.

పరిహారంతో పాటు ఇల్లు మంజూరు..

నార్నూర్: మూడు రోజుల క్రితం వ్యవసాయ పనులు చేస్తూ పిడుగుపాటు గురై మృతి చెందిన కుటుంబాలను శనివారం ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ పరామర్శించారు. పిప్రి గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాలతో మాట్లాడారు. గాయపడిన చిన్నారులను పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలం వ్యవసాయ పనులు చేసే క్రమంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. పరిహారం చెల్లించడంతో పాటు ఇల్లు మంజూరు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

నార్నూర్: గత మూడు రోజుల క్రితం గాదిగూడ మండలంలోని పిప్రి గ్రామానికి చెందిన పెందూర్ మాధవ్‌రావ్ కుటుంబసభ్యులు పిడుగు పాటుకు గురై మృతి చెందగా విషయం తెలుసుకున్న రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీ బాయి శనివారం పిప్రి గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాలను పరామర్శించారు. ప్రమాదానికి సంబంధించి పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మృతి చెందిన వారి బంధువులు గాయాలతో ఝరిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతుండడంతో ఆసుపత్రి వెళ్లి వారిని పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ మాజీ డైరెక్టర్ మడావి మానుకు, బీఆర్ఎస్ నార్నూర్ మండల అధ్యక్షుడు మెస్రం హన్మంతరావు, ఉర్వేత రూప్‌దేవ్ పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటించాలి

బేల: వర్షకాలంలో పొలాలకు వెళ్లే వారు జాగ్రత్తలు పాటించాలని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్‌లు అన్నారు. శనివారం మండలంలోని సోన్‌కాస్, సాంగిడి గ్రామాల్లో ఇటీవల పిడుగుపాటుకు గురై మృతి చెందిన కోవ సునీత, గేడం నందిని కుటుంబాలను పరామర్శించారు. ప్రభుత్వం నుంచి అన్ని రకాలుగా సహకారం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు.

జోగు రామన్న పరామర్శ

సాత్నాల: ఇటీవల పిడుగుపాటు గురై మృతి చెందిన గేడం అనిత కుటుంబసభ్యులను శని వారం మాజీ మంత్రి జోగు రామన్న పరామర్శించారు. ధైర్యం కోల్పోవద్దని, ఉంటామని ధైర్యం చెప్పారు. మనోధైర్యంగా ఉండాలన్నా రు. ఆయన వెంట బట్టు సతీష్, కాసర్ల అశోక్, మాజీ వైస్ ఎంపీపీ పట్టేపు విలాస్, సుభాష్ రెడ్డి ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

బేల: మండలంలోని సోన్‌కాస్, సాంగిడి గ్రామాల్లో ఇటీవల పిడుగుపాటుకు గురై మృతి చెందిన కోవ సునీత, గేడం నందిని తాలుకు బాధిత కుటుంబాలకు శనివారం జిల్లా సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్‌రెడ్డి ఒక్కొక్క కుటుంబానికి రూ.5వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట సురేందర్‌రెడ్డి, బాపురావు, సచిన్, ఆశన్న యాదవ్, దినేష్, శ్రీకాంత్, సాయి, తదితరులు ఉన్నారు.

బేల: మండలంలోని సోన్‌కాస్, సాంగిడి గ్రామాల్లో ఇటీవల పిడుగుపాటుకు గురై మృతి చెందిన కోవ సునీత, గేడం నందిని బాధిత కుటుంబాలకు శనివారం జిల్లా సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్‌రెడ్డి ఒక్కొక్క కుటుంబానికి రూ.5వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు.

పెన్‌గంగలో ఇసుక 'తోడేళ్లు'

- కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు
- చోద్యం చూస్తున్న మైనింగ్, రెవెన్యూ, పోలీస్‌శాఖ


పెన్‌గంగలో తవ్వుతున్న ఇసుక

జైనథ్: మండలంలో పెన్‌గంగ నది పరివాహక గ్రామాల్లో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. పలుమార్లు అధికారులు కేసులు నమోదు చేసినప్పటికీ అక్రమార్కులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. జిల్లా కలెక్టర్ ఇటీవల అక్రమ ఇసుక రవాణాకు చెక్ పెట్టేందుకు సర్క్యులర్ జారీ చేశారు. ప్రైవేటు వ్యక్తులు రూ.700 ప్రభుత్వానికి రుసుము చెల్లించి ట్రాక్టర్ లేబర్ సాయంతో ఇసుక తీసుకెళ్లాల్సి ఉంది. అదే విధంగా ప్రభుత్వ కార్యకలాపాల కోసం రూ.500 రుసుము చెల్లించాలి. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్లకు ఎలాంటి రుసుము చెల్లించకుండా ఇసుకను తీసుకెళ్లాల్సిందిగా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటి వరకు ఏ ఒక్కరూ కూడా కలెక్టర్ ఆదేశాలను పాటించడం లేదు. ఇష్టారాజ్యంగా పెన్‌గంగలో జేసీబీతో ఇసుక తవ్వుతున్నారు. ఇంత జరిగినా అధికారులు మాత్రం మామూళ్ల మత్తులో మునుగుతున్నారు.

అనుమతి ఇవ్వలేదు

పెన్‌గంగ పరివాహక ప్రాంతాల్లో ఇసుక తవ్వకాలను ఎలాంటి అనుమతి ఇవ్వలేదు. అక్రమ ఇసుక రవాణా చేస్తున్న వారిని గుర్తించి శాఖపరమైన చర్యలు తీసుకుంటాం. ట్రాక్టర్ సీజ్ చేయడంతో పాటు జరిమానా విధిస్తాం.

– ఆత్రం నారాయణ, తహసీల్దార్